# 5. లోకాలోకనం

## బస్సులో . . .

ఎండ నిప్పులు చెరుగుతోంది. బస్సు ఇంకా రాలేదు. అప్పటికే నేను స్టాపింగ్ వద్దకు వచ్చి పది నిమిషాలయింది. ఆ మండుటెండలో కూడా ఒక వికలాంగుడు దారిని వచ్చే పోయే జనాన్ని చూచి 'కాలణా (కాని) యీ సామీ' అని అడుగుతున్నాడు. అతడు నా దగ్గరికీ వచ్చాడు. చెయ్యి చాపి తన మామూలు పాటను పాడాడు. అయినా నా మనస్సు కరగలేదు. 'ఒక కాలణా యీ సామీ' అని యెంతో జాలిగా అడిగాడు. చొక్కా జేబులోకి చెయ్యి దూర్చాను. ఇంతలో నేను ఎక్కవలసిన బస్సు రావడం చూచాను. అంత దాకా అక్కడక్కడా ఉన్నవారంతా ఒక్కసారిగా స్టాపింగ్ వద్దకు వచ్చారు. ఒక పెద్ద క్యూ ఏర్పడింది. ఇంత సేపూ ఎండలో నుంచున్నా బస్సులో చోటు దొరుకుతుందా అనే సందేహం క్యూని చూడగానే నాకు కలిగింది. వికలాంగుడు 'కాలణా యీ సామీ' అని మళ్లీ అడుగుతూ ఉండగానే బస్సు వచ్చి స్టాపింగ్ వద్ద నిలబడింది.

ప్రయాణికులతో కిటకిటలాడిపోతోంది బస్సు. అందు లోంచి ఒక్కరైనా దిగలేదు. క్యూలో ఉన్న కొందరు ముందుకు తోసుకుంటూ, బస్సు ఎక్కడానికి మొదలు పెట్టారు. ఇంకేముంది? కండక్టరు కాలభైరవావతారం దాల్చాడు.

ఇరంగు, ఇరంగు (దిగు దిగు)' అని కేకలు వెయ్యసాగాడు. అతని మాటల్ని ఎవరైనా వినిపించుకుంటేగా దిగేందుకు? ఒక్కరూ దిగలేదు. కండక్టరు కోపం ద్విగుణీకృతమయింది. 'మీరెవ్వరూ దిగకపోతే రైటు చెప్పను' అంటూ భీష్మించాడు. వాదోపవాదాలూ, ఖండనమండనలూ జరిగాయి. 'కండక్టరు దయాదాక్షిణ్యాలు లేని కఠినుడు. బస్సులో ఉండేవాడికి ఎండ బాధ ఏం తెలుస్తుంది? ఇష్టమైతే ఎక్కడ పడితే అక్కడే బస్సుని ఆపనూవచ్చు, అభిమానుల్ని ఎక్కించుకోనూవచ్చు' అని కండక్టరుమీద అక్షింతలు పడ్డాయి.

అతను మాత్రం తక్కువవాడయితే గదా! 'ఎక్కినవాళ్లందరికీ టికెట్లు ఇవ్వద్దూ. నేను మాత్రం మనిషిని కానూ? ఇంతలో చెకింగ్ ఇనస్పెక్టరు వచ్చాడంటే, నా పని పడతాడు. నా ఉద్యోగానికేమన్నా యిబ్బంది వస్తే, అప్పుడు నన్నూ నా సంసారాన్ని పోషిస్తారా మీరంతా? చెప్పండి? అంతగా అయితే బస్సులు చాలడం లేదని ఫిర్యాదు చెయ్యండి. పత్రికల్లో ఉత్తరాలు రాయండి' అన్నాడు యుక్తియుక్తంగా కండక్టరు.

ఎలాగయితేనేం కండక్టరుదే పై చెయ్యి అయింది. కొత్తగా ఎవ్వరూ బస్సు ఎక్కలేదు. ఎక్కినవాళ్ళు దిగారు. కండక్టరు విజయగర్వంతో రైటు చెప్పగానే బస్సు తుర్రుమంది.

'కాలణా యీ సామీ' అంటూ వికలాంగుడు నన్ను మళ్ళీ తగులుకున్నాడు.

నాకు ఓర్పు తగ్గిపోయింది. చిరాకు ఎక్కువయింది. చెమటతో చొక్కా నీటిముద్దయింది. అసలే నేను స్థూల

కాయుణ్ణి. నా అవస్థ వేరే చెప్పాలా? అందులోనూ ఆ వికలాంగునిపట్ల నేను ప్రదర్శిస్తున్న వైఖరిని చూచి సహించలేక కాబోలు, ఎండ దొర ఇంకా నిప్పులు చెరుగుతూ ఉన్నాడు. జేబులోకి చెయ్యిదూర్చి ఒక్క అణా తీశాను. ఆ వికలాంగుడికి అణా యివ్వడానికి నాకు మనసు రాలేదు. చిల్లర లేదని అన్నాను. అంతదాకా ఒక్క చిల్లిదమ్మిడీ అయినా లేదని మొత్తుకున్న అతను సరిగ్గా రెండు కానులు బొడ్డు లోంచి పైకి తీశాడు. ఆ రెండు కానులు తీసుకుని అతని చేతిలో అణా పెట్టాను.

వికలాంగుడికి ఏనుగెక్కినంత సంతోషం కలిగింది. 'మా రాజులా బతుకు నాయనా' అంటూ నన్ను మనసారా దీవించి అతను ఇంకో పెద్దమనిషి వద్దకు వెళ్ళాడు. ఇంతలో మరో బస్సు వచ్చింది. ఇదీ కిటకిటలాడుతూనే ఉన్నది. కాని కండక్టరు ముఖంలో కొంచెం మంచితనం కనిపించింది. అంతే, స్టాపింగ్ వద్ద చేరిన జనసమూహం అమాంతంగా బస్సులోకి అడుగుపెట్టింది.

వచ్చిన కోపాన్ని ఎలాగో అణుచుకుని కండక్టరు 'పో సార్' అన్నాడు, బస్సు ఎక్కిన గుంపు నుద్దేశించి. అతని మాటలు వినేసరికి నాకు నవ్వు వచ్చింది. తమిళభాషలో గౌరవ వాచకం లేదా, లేక కండక్టరు తన కోపాన్ని ఈ విధంగా వెళ్ళగక్కుతున్నాడా! అనుకున్నాను. 'పోంగు సార్' (ముందుకు పొండి) అనలేక కాబోలు 'పోసార్' అన్నాడని నన్ను నేను సమాధాన పరుచుకొని తృప్తిపడ్డాను.

ఎక్కిన జనానికి టికెట్లు ఇచ్చేందుకు మూడు నిమిషాలు పట్టింది. ఈ మూడు నిమిషాలు మూడు యుగాలుగా

గడిచాయి. సీట్లలో కూర్చున్నవాళ్లు కొంచెమైనా ఒదిగి కూర్చోరు. నుంచున్నవాళ్లా ఒకరిమీద ఒకరు వాలిపోతారు. ఎవ్వరినీ తప్పుపట్టడం మంచిది కాదేమో!

నిండుకుండలా ఉంది బస్సు. ఏ స్టాపింగ్‌లోనూ ఆగకుండా గాలితో మాట్లాడుకుంటూ వెడుతోంది. ఎండవేళ కాబట్టి బాటలు శూన్యంగా ఉన్నా ఇలా డ్రైవరు బస్సు నడపడం ధర్మమేనా అని నేను ప్రశ్నించుకున్నాను. తర్వాత కొంత సేపటికి, ఒక స్టాపింగుకి రెండు మూడు గజాల దూరంలో బస్సు ఆగింది. పాడు మనస్సు, ఎందుకో శంకించింది. కాని జనం దిగుతూండడంవల్ల నా మనస్సు కుదుటబడింది. నుంచున్న ప్రయాణికులు చాలామంది దిగడంవల్ల బస్సు ఖాళీ అయింది. రెండు సీట్లు కూడా ఖాళీ అయ్యాయి. కొత్త గాలి పీల్చడంతో పోయిన ప్రాణం తిరిగివచ్చినట్లనిపించింది నాకు. బ్రతుకు జీవుడా అంటూ, రెండు అంగుళాలు లోతుకుపోయిన ఒక సీటులో చతికిలపడ్డాను. నా పక్కగా నడివయస్సులో ఉన్న ఒక ఆసామి కూర్చున్నాడు.

దిగవలసినవాళ్లు దిగినతర్వాత, ఆ స్టాపింగ్‌లో ఒక జవ్వని ఎక్కింది. ఆమెకు సుమారు పాతికేళ్లు ఉండవచ్చు. సహజ సౌందర్యం లోపించినా, ఎంతో ఆకర్షకంగా ఆమె అలంకరించుకుంది. ప్రకృతికి కూడా వన్నెచిన్నెలు సమకూర్చగల మహత్తర శక్తి మానవునిలో ఉన్నదనే పరమసత్యం నాకప్పుడు తేటతెల్లమయింది. అందం రంగులో లేదు; కనుముక్కు తీరులో కొంతవరకే ఉన్నదనుకున్నాను.

అన్ని సీట్లలోనూ అందరూ సుఖోపవిష్టులై ఉండడం మూలాన అ యువతికి కూర్చునే అవకాశం కలగలేదు. నా

పక్కనున్న సహృదయుడు తన చోట్లోంచి లేచి, తన స్థానం ఆక్రమించవలసిందిగా ఎక్కడలేని సౌజన్యం ప్రకటిస్తూ ఆమెను కోరాడు. ఆమె అతని సీటులో కూర్చుంది, ముక్తసరిగా 'థాంక్స్' అంటూ.

పక్కస్టాపింగ్‌లో బస్సు ఆగింది. ఆమె తన సీటునుంచి లేచింది. నే నెందుకో అనుకున్నా. ఆమె బస్సు దిగి చరచరా నడవసాగింది. 'ఓస్! ఈ కాస్త భాగ్యానికే బస్సు ఎక్కాలా?' నాలో నేను నవ్వుకున్నాను. ఆమెకు సీటు యిచ్చిన సహృదయుడు మళ్లీ ఆ చోటులో కూర్చున్నాడు. ఇంతలో ఒక అవ్వ బస్సు ఎక్కింది. ఆమె నుదుట రూపాయంత కుంకుమ బొట్టు కలకలలాడుతోంది. ముడతలుపడ్డ ఆమె ముఖం ఎన్ని వసంతాలూ గ్రీష్మాలూ చూసిందో!

బస్సు కదిలింది. ఆమె నుంచునే ఉంది. బస్సుతోపాటు ఆమె కూడా అటూ ఇటూ కదులుతూనే ఉంది. ఆమె కెవ్వరూ సీటు ఇవ్వలేదు. నేను లేచి నా చోటుని అవ్వకు యిద్దామనుకున్నాను. కాని, నాలో తిష్ఠవేసుకున్న స్వార్థం నన్ను లేవనిస్తేనా? ఏంచెయ్యను మరి! బస్సు వెడుతూనేవుంది; అవ్వ నిలబడేవుంది.

'పాట్టీ! ఇంగే ఉక్కారు' (అవ్వా! ఇక్కడ కూచో) అనే మాటలు నా చెవిని పడ్డాయి. నేను వెనక్కితిరిగి చూశాను. ఒక మోటుమానిసి—సాదాగుడ్డలు ధరించాడు కాబట్టి—తన సీటును ఖాళీచేసి అందులో అవ్వను కూర్చోబెట్టాడు.

నా దృష్టిలో అతడు మోటుమానిసే కావచ్చు. ఏదో కూలిపని చేసుకుని జీవించే అల్పజీవి కావచ్చు. నా కున్నంత

విద్యా, సంస్కారాలు అతనిలో లేకపోవచ్చు. సంఘంలో అతనికి గౌరవమర్యాదలు లేకపోవచ్చు. కాని అతని హృదయంలో మాలిన్యం అంతగా కనిపించదేమో! బాహ్యాకారంలో, నా దృష్టికి—అతడు మోటువాడే అయినా అతని ఆంతర్యం మాత్రం మంచిది. అందుకనే కాబోలు అతడు పైకి మోటుగా కనిపిస్తున్నాడు. బనీను, చొక్కా, కోటు—వీటితో నేను నాలోని మాలిన్యాన్ని కప్పిపుచ్చుకుంటున్నాను. నిజానికి ఆ మోటు మానిసే సహృదయుడు!

## బజారులో . . .

బస్సు దిగాను. ఆ రోజు ఆదివారం. చెన్నగరం అంగడి వీథులు నిద్రపోతున్నవి. 'వాసనలేని పువ్వు బుధవర్గము లేని పురంబు.....' అనే పద్యం సెలవిచ్చిన కవివరేణ్యుడు కనక ఆదివారపు చెన్నగర వీథుల్ని చూచినట్లయితే ఏమని వర్ణించేవాడో! కొంచెం ఊహాగానం చేశాను. చచ్చి స్వర్గాన ఉన్న ఆ కవిశేఖరుడు నా మనస్సులో ప్రవేశించాడు. శూన్యము లైన బాటలును శోభ నశించిన...అని సెలవిస్తాడేమో అనుకున్నా. అబ్బే...కొత్త గొంతు వినిపించింది. కాలం మారిందిగదా మరి!

ఆదివారం!
ఆ దివాకరుడికి
మోదము గూర్చే
సుదినము కావచ్చు.
కాని...నాకీ

భానువారం
పెనుతుఫాను వీచే
దుర్దినం.
వెలవెల బోయే
బజారు వీథులు
గలగల లాడని
గల్లాపెట్టెలు;
ముద్దబ్బాయిల
మడ్డిమొగాలు...

ఎందుకో ఆ మహాకవి ఉన్నట్టుండి నా మనోవీథినించి నిష్క్రమించాడు.

ఎండలో తిరగడంవల్ల కొంచెం అలిసిపొయ్యాను. శీతల పానీయం ఏదైనా సేవించాలని అభిలషించాను. చెన్నపట్నంలో కాఫీమందిరాలకేం తక్కువ? ఇంటిలో మంటిపొయ్యిలా సందుకో హొటలు.

ఆదివారం కావడంవల్ల పెద్ద హొటళ్లు సెలవు తీసుకున్నాయి. ఒక సందు మొదట్లో చిన్న హొటలొకటి తెరిచి వుండడం చూశాను. అందులోకి ప్రవేశించాను. సింహద్వారం వద్ద ఎత్తుకుర్చీలో పరుపు వేసుకుని దానిమీద కూర్చున్న మేనేజర్ని దాటి లోపలికి వెళ్ళాను. ఒక కుర్చీలో కూర్చున్నాను. విద్యుత్ పంకాలు విశ్రాంతి తీసుకుంటున్నాయి. నన్ను చూచి చరచరా ఒక సర్వరు పంకా వేసి నన్ను సమీపించాడు. నా మొగం చూడడంతోనే తెలుగువాడినని అతని కుశాగ్రబుద్ధి గ్రహించింది.

'ఏమి తింటువు?' అని ప్రశ్నించాడు నన్ను. ఆ ప్రశ్న వినేసరికి నాకు ఛుర్రుమంది. నన్ను చూసి ఇంత చులకనగా మాట్లాడతాడా? అనిపించింది. పొద్దున లేచింది మొదలు రాత్రి నిద్రపోయేవరకు ఆ సర్వరు 'సార్' అనే మాటను కనీసం ఒక్క వెయ్యిసార్లయినా జపించివుంటాడు. ఆ 'సార్'ని నా మొహాన ఒక్కసారి పారవేస్తే వాడి సొమ్మేం పోతుందని! లేక అతని కంటికి నేను పల్లెటూరివాడిలా కనిపించానేమో!

నేనేమీ బదులు చెప్పకుండా, తోమి చాలా రోజు లయిన యిత్తడి పళ్లాలలో అమర్చబడిన తినుబండారాల షెల్ఫు వంక చూపు నిలిపాను. ఆ చుట్టుపక్కల అయిదారు గండు చీమలు పైకీ, కిందికీ పాకుతున్నాయి. ఆ షెల్ఫుకి పక్కగా ఒక నల్లని టేబులు. దానిమీద కాఫీకషాయం తయారవు తోంది. సబ్బునీ, నీళ్లనీ చూసి చాలా రోజులైన ఒక తుండు గుడ్డను కట్టుకున్నాడు, కాఫీ తయారుచేసే ఆ మహానుభావుడు. ఆ దృశ్యం చూసేసరికి హోటలంటేనే నాకు రోత పుట్టింది. ఈ 'హోటలు వైరాగ్యం' పురాణ, శ్మశాన, ప్రసూతి వైరా గ్యాల వర్గంలో చేర్చదగిందిగా భావించాను. అదీకాక రోట్లో తలదూర్చి రోకటిపోటుకి భయపడితే ఎలా? హోటలుకి వచ్చిన తర్వాత కళ్ళుమూసుకుని ఏదో ఒకటి పొట్టలో వేసుకోక పోతే ద్వారందగ్గర ఎత్తుకుర్చీమీద కూర్చున్న ఆ మేనేజరు ఏమైనా అనుకోడు పాపం! అదీకాక నా మూలాన తెలుగు వాళ్ళంతా వట్టి లోభులని అనుకోడూ!

'కిచిడీ, కారాబూంది, ఇడ్లీ, వడ, థైర్ వడ, ఊత్తప్పం ఉంటుంది. ఏం కావాల?' అడిగాడు సర్వర్. తెలుగు

వాడినైనా నేను 'ఒణ్ణుం వేండా—కాఫీ పోరుం' (ఏమీ వద్దు, కాఫీ చాలు) అని కావాలని అరవంలోనే అన్నాను. వెంటనే సర్వర్ 'ఎన్నా సార్—ఊత్తప్పం సూడా యిరుక్కు సార్...' అన్నాడు.

అతను 'సార్' అంటూంటే నాకు సంతోషం కలిగిందని వేరే చెప్పాలా? ఊత్తప్పం అనే మాట నాకేదో కొత్తగా ఉంది. ఇదేమిటో రుచి చూడాలనీ అనిపించింది' కాని ఒకట ధర్మసందేహం నన్ను వెంటాడింది. తెలుగులోనా తమిళంలోనా యీసారి చెప్పడం! చివరికి తెలుగులోనే అన్నాను. 'వేడిగా ఉంటే ఒకట ఊత్తప్పం తీసుకురా, చాలు.' అతను నా వైపు ఎగాదిగా చూసుకుంటూ లోపలికి వెళ్ళిపోయాడు. మళ్ళీ తిరిగివచ్చి 'సార్—ఇంకా రెండు నిమిషాలు పట్టును. వడ తెమ్మంటురా?' అన్నాడు.

'అలాగే తీసుకురా నాయనా' అన్నాను నేను.

వడ తింటున్నాను. అంతలో సర్వర్ ఊత్తప్పం పళ్లెంతోనూ, సాంబార్ పళ్లెంతోనూ నాముందు నిలిచాడు. ఊత్తప్పం పళ్లెం బల్లమీద పెట్టి 'సార్, సాంబార్ భోంచేస్తురా? మిరప్పొడి వుంది, కొంచుకురానా?' అన్నాడు.

అసలే ఎండలు మండిపోతున్నాయి. పైగా ఎండలో వచ్చాను. కనుక సాంబారే కావాలన్నాను. అరవవారి ఓర్పు, కార్యదీక్ష, కలుపుగోలుతనము—మొదలైన మంచి గుణాలు పట్టుబడకపోయినా వారి సాంబార్లూ, చేదుచట్నీలూ మాత్రం నాకు అలవాటయ్యాయి. గంపెడాశతో ఊత్తప్పం వంక చూశాను. పేరు గొప్పగా ఉన్నది కాని మరేమీ లేదు.

మా నాయనమ్మ చేసే దిబ్బరొట్టె గుర్తుకు వచ్చింది. అయితే, ఊత్తప్పంలో ఉల్లిపాయ, పచ్చిమిరపకాయలు, అల్లంముక్కలూ ఉన్నాయి. అంతకుమించి ఆ దిబ్బరొట్టెకూ, ఈ ఊత్తప్పానికీ నాకేమీ భేదం కనబడలేదు. సగం ఊత్తప్పం తినేసరికి కడుపు నిండిపోయింది. దాన్ని విడిచిపెట్టి 'సర్వర్' అని పిలిచాను.

'ఏంకావాల సార్?' అన్నాడు సర్వర్.

'కూల్ డ్రింక్ ఏదైనా తీసుకురా' అన్నాను. 'కూల్ డ్రింక్సు లేదు. మోర్ కావాలా?' అన్నాడు. 'సరే' అన్నాను.

మజ్జిగ చిక్కగా, చల్లగా, రుచిగా ఉన్నాయి. రెండు గుక్కలలోనే మజ్జిగగ్లాసు ఖాళీ అయింది. గ్లాసు అడుగు భాగాన పిండివంటి మెత్తనిపదార్థం ఉన్నది. అదేవిటో పరిశీలించాలనే కుతూహలంకొద్దీ గ్లాసుని భోర్లించాను. చూడగా అది మైదాపిండి. అందుకనే కాబోలు మజ్జిగ అంత చిక్కగా ఉన్నాయి.

సర్వర్ ఇచ్చిన బిల్లుని చెల్లించి హోటలునుంచి ఎలాగో బయటపడ్డాను.

అయిదారు అంగళ్లు మాత్రమే తెరిచి ఉన్నాయి. నన్ను చూడడంతోనే అంగళ్లలో ఉండే గుమాస్తాలు 'బాబూ, రండి రండి—' అని కేకలువెయ్యడం మొదలుపెట్టారు. ఆ మాటల్లో ఎంత ఆప్యాయత! ఎంత వినయవిధేయతలు! నాదగ్గర డబ్బు ఆటే లేదు. అందువల్ల కొంచెం తటపటాయిస్తూ ఒక అంగడి ముందు నిలబడ్డాను. అంతే; ఆ అంగట్లోవున్న పెద్దాయన (వృద్ధుడు) 'బాబూ, రండి, రండి. లోపలికి వచ్చి చూడండి.

ఏమీ కొనక్కర్లేదు లెండి' అన్నాడు. నేనా దుకాణంలోకి వెళ్లాను.

అది గుడ్డలకొట్టు. రకరకాల రంగురంగుల గుడ్డలెన్నో ఉన్నాయి. అందులోనూ ఆ విద్యుద్దీపాల కాంతిలో అవి ధగధగా మెరిసిపోతున్నాయి. వాటిని చూస్తుంటేనే నా అశక్తత నాకు బోధపడింది. 'బాబూ, ఊరికేనే చూడండి. మీకు నచ్చితేనే కొనండి' అంటూ ఆయన నాముందు దొంతర దొంతరలుగా గుడ్డలు పడేశాడు. కనీసం ఒక్క యిరవై రూపాయలైనా ఉంటే మంచి రకం గుడ్డ మూడు గజాలు కొనవచ్చు. నాదగ్గర తొమ్మిది రూపాయలు ఉన్నాయి. పోనీ ఏమీ కొనకుండా రిక్తహస్తాలతో వెడితే వృద్ధుడేమనుకుంటాడో! అతని శ్రమంతా వృథా అవుతుంది.

'చూడండి, నాకివేమీ వద్దు. గజం రెండు రూపాయలు లోపుగా ఉండే గుడ్డలు చూపండి' అన్నాను. 'సరే' అన్నాడు వృద్ధుడు.

నాకు నచ్చిన గుడ్డ ఏదో చూచి బేరమాడడం మొదలు పెట్టాను. గజం ఒకటికి రూపాయన్నర చేసి మూడు గజాలు చింపమన్నాను. వృద్ధుడు మాకేమీ గిట్టదంటూ వాదించాడు. ఆయనకంటే నేనెంతో పట్టుదలతో వాదించాను. సరే చివరికి తొమ్మిదణాలు చేసుకోమన్నాను. వృద్ధుడు సరే అని మూడు గజాలు చింపి, బిల్లువెయ్యమని పక్క గుమాస్తాని పురమాయించాడు. అతను గజం రూపాయి పదణాల చొప్పున బిల్లు వేసి నా చేతికిచ్చాడు. బిల్లు చూచి 'ఏమిటి! ఇంకో అణా పెచ్చువేశారే?' అన్నాను సౌమ్యంగా వృద్ధునితో.

45 ఏ.పి. ప్రాచ్య గ్రంథాలయం, [illegible]
ప్రవేశ సంఖ్య... 27111

'మసం అనుకున్నది పదణాలేగా' అన్నాడు వృద్ధుడు, బిల్లు వేసిన గుమాస్తాని చూస్తూ.

'కాదు తొమ్మిదణాలు—' అన్నాను నేను.

వృద్ధుడు కోపంతో 'డబ్బులేకుండా బేరం చేద్దామని వచ్చావా? చూస్తే పెద్ద మనిషిలా కనబడుతున్నావు' అన్నాడు.

నాకూ కోపం వచ్చింది. ఎలాగో అణుచుకుని, బిల్లు చెల్లించి, వీధిలోకి వచ్చాను.

## తమలపాకుల బడ్డీవద్ద

బ్రతుకు జీవుడా అనుకుంటూ గుడ్డలకొట్లోంచి బయటపడి వీథిలోకి వచ్చాను. రాగానే నా దృష్టి ఒక తమలపాకుల బడ్డీమీద పడింది. ఇందుకు కారణం లేకపోలేదు. అప్పుడా దుకాణంలో గల్లాపెట్టె వద్ద ఒక అలికులవేణి ఆసీనురాలై ఉంది. నుదుట అర్ధరూపాయంత కుంకుమబొట్టు. సంతత తాంబూల చర్వణంవల్ల కాబోలు ఎఱ్ఱెక్కిన పల్వరుస. చేతులకు నాలుగైదు జతల బంగారు గాజులు. మెడలో మూడు పేటల చంద్రహారం. యువతి కాకపోయినా, ముఖంలో మంచి కళ! తటుక్కున నాకు శ్రీనాథ మహాకవిదిగా చెప్పబడుతున్న యీ కింది చాటువు స్ఫురణకు వచ్చింది.

'త్రాలకరి మించు దీవగతిఁ దోవ దుకాణముమీదనున్న య
య్యాలికులవేణితో తములపాకుల బేరము లాడబోయి నే
వలచుట కేమి శంకరుని వంటి మహాత్ముడు లింగరూపియై
కులికెడు దాని గుబ్బచను గుబ్బల సందున నాట్యమాడె
డున్.'

లింగరూపి అయిన శంకరుడు నా కంటబడలేదు గాని, ఆ శంకరుని కుమారరత్నమైన మురుగ భగవానుని (కుమార స్వామి) ముద్దులు మూటగట్టే పటం ఒకటి ఆమె వెనకాల ఉంది. దాన్ని ఆనుకుని మురుగని చిత్రంగల ఒక క్యాలెండరు ఉంది. తమిళులకు మురుగడంటే మహాభక్తి! ఆయన తమిళ దైవమని కొందరి అభిప్రాయం.

ఆ బడ్డీని చూడగానే తాంబూలం వేసుకునే అలవాటులేని నాకూ తాంబూలం సేవించాలని ఆశ కలిగింది. బడ్డీని సమీపించాను. ఒక ఇత్తడి పళ్లెం నిండుగా కట్టిన కిళ్లీలు. వాటిని ఉద్దేశించి 'ఎంత?' అని అడిగాను.

'ఒకటీ, ఒకణా.'

అణాయిచ్చి ఒక కిళ్లీ తీసుకోబోతుంటే ఆమె అన్నది: 'స్పెషల్ కిళ్లీ కావాలంటే, రెండు నిమిషాల్లో కట్టియిస్తా.'

'సరే' అన్నాను.

నామీద ఆమెకు ఆదరభావం కలిగినట్టుంది. లోపలినుంచి ఒక స్టూలు తీసి, నాకందిస్తూ 'కూచోండి' అంది.

స్టూలుమీద కూర్చుని, వచ్చే పోయే కార్లూ బస్సులూ చూస్తున్నాను.

కిళ్లీ కడుతూ 'తంగబస్మం వేసేదా?' అడిగింది ఆమె.

తంగబస్మం అంటే యేమిటో నాకు తెలీదు. అయినా వద్దని చెప్పలేక సరే అన్నట్టు తల ఊపాను. తంగబస్మం అంటే యేమిటో తెలుసుకోవాలని ఆశ కలిగింది. ఏమిటది? అని అడుగుదామనుకున్నాను.

ఇంతలో 'సామీ, ధర్మం చెయ్యండి' అంటూ ఒక ముసలా విడ గొంతు వినిపించింది. ఆమె వెనకాల ఒక నిండు చూలాలు!

'ఆసుపత్రికి వెడుతున్నాం బాబూ. బస్సు చార్జి తక్కువయింది. ధర్మం చెయ్యండి బాబూ.'

ఆ నిండు చూలాలిని చూస్తే జాలి కలిగింది. జేబులోంచి పావలా బిళ్ల తీసి ఆ వృద్ధురాలికి ఇచ్చాను.

ఆతర్వాత సంతోషిస్తూ వాళ్లిద్దరూ వెళ్లిపోయారు.

కాని కిళ్లీ కడుతున్న కొట్టు యజమానురాలు నన్ను చూసి పెద్దగా నవ్వసాగింది. అందులో అపహాస్యం తొంగిచూసింది.

ఆమె నవ్వుని చూసి ఏదో కుంభకోణం జరిగిందనుకున్నాను. అమాయకంగా ఆమె వంక చూశాను.

'చదువుకున్న వాడివి. ఏం లాభం? అది చూలాలూ కాదు, గీలాలూ కాదు. అంతా నాటకం' అంది.

కూటికోసం కోటి విద్యలని పెద్దలు ఊరికే అన్నారా! అనిపించింది నాకు.

'నువ్వే కాదు, నేనూ ఒకసారి ఏమారిపోయాను' అంటూ ఆమె చెప్పడం మొదలుపెట్టింది. ఆమె యిచ్చిన స్పెషల్ కిళ్లీ నములుతూ కథ వినసాగాను.

"మొన్న నేను మాంబళంనుంచి తిరిగి వస్తూవుండగా, రోడ్డు మీద ఒక పక్కగా సుమారు నలభై యేళ్ల ఆసామి పడుకుని వున్నాడు! వాడి పక్కన ఆరేళ్ల అమ్మాయి కూర్చుని ఏడుస్తూ వుంది. ఆ దగ్గర్లో మరెవ్వరూ లేరు. ఆ అమ్మాయిని చూడ

గానే నాకు కడుపు తరుక్కుపోయిందంటే నమ్ము. ఎంత పలక రించినా అతను పలకడు, వులకడు. మూర్ఛరోగం ఏమన్నా ఉందేమో అనుకున్నా. ఆ అమ్మాయికి అర్ధరూపాయి ఇస్తూ వుండగా, ఆ దారిని వెడుతున్న ఒకాయన 'వీడి కిదే పని, రోజుకో రోడ్డుమీద యీ నాటకం ఆడుతూవుంటాడు' అన్నాడు..."

ఆమె మాటల్ని వినిపించుకునే స్థితిలో లేను నేను. ఒకటే మైకంగా ఉంది. తల తిరిగిపోతోంది. కళ్లు మూసుకుని ముందుకీ వెనక్కీ ఊగడం మొదలుపెట్టాను.

నన్నుచూసి ఆమె ఆదుర్దాగా 'ఏం బాబూ, ఏవిటలా వున్నావు?' అడిగింది.

మంచినీళ్లు కావాలన్నాను.

ఆమె సోడా యిచ్చింది.

సోడా తాగిన కొంతసేపటికి మైకం తగ్గినట్టనిపించింది. కాని తలదిమ్ము మాత్రం సాంతం పోలేదు. పైగా డోకు వచ్చేలా ఉంది.

'నీకు పొగాకు అలవాటులేదా!' ఆమె అడిగింది.

లేదన్నాను.

అంతే. ఆమె ఆదుర్దా మాయమయింది. 'అలవాటు లేనప్పుడు తంగబస్మం ఎందుకు వేసుకున్నావు? నే నడిగానుగదా! అప్పుడు చెప్పకూడదు, అలవాటు లేదని...'

'తంగభస్మమంటే పొగాకు పొడా?'

'ఇది తెలీదా' అంటూ ఆమె నవ్వింది.

ఇంతలో నేను డోక్కున్నాను. తలదిమ్ము వదిలిపోయింది. మళ్లీ మామూలు మనిషినయినాను. కొంచెం మంచినీళ్లు తాగాను.

సోడాకుగాను ఇవ్వవలసిన డబ్బు ఆమె కిచ్చి, నేను నడక సాగించాను.

ఆమె హితబోధ చేసింది.

'ఇంకెప్పుడూ పొగాకు చేర్చుకోకు తాంబూలంలో. ఏదన్నా తెలీకపోతే అడిగి తెలుసుకోవటం మంచిది.'

## బీచిలో . . .

సాయంకాలమయింది. ఎండ తగ్గింది. సముద్రపుగాలి మెలమెల్లగా వీస్తోంది. ఆ మందమారుతం నాకెంతో హాయి గొలిపింది. సముద్రం ఒడ్డుకి వెళ్లాలని నా మనస్సు తహతహ లాడింది. చెన్నపట్టణంలో చూడవలసిన రమణీయ ప్రదేశ మేదైనా ఉన్నదంటే, అది బీచి అని నా అభిప్రాయం.

తిరువళ్లిక్కేణి బీచి వైపు నడవసాగాను. చల్లగాలిని పీల్చే కొద్దీ నాలో మధురమనోహర భావాలేవో పరుగులు తీశాయి. బస్సులో నేను అనుభవించిన యమయాతన, గుడ్డలకొట్లో నాకు వచ్చిన కోపం—అన్నిటినీ విస్మరింపగలిగాను. చిన్నా పెద్దా, ఆడా మగా—ఎందరెందరో తీర్థప్రజలా బారులు తీరి బీచికి వెడుతున్నారు. శ్రీగల భాగ్యశాలురు కార్లల్లో రయ్యిమని ఎగిరివెడుతున్నారు. నేను రెండు వైపులా వున్న దీపస్తంభాలను చూసుకుంటూ వెడుతున్నాను.

వానలో తడియని వ్యక్తి, ఎండ కన్నెరుగని శుద్ధాంత స్త్రీ ఉండవచ్చునేమోకాని, సున్నపు బొట్లులేని దీపస్తంభం ఒక్కటైనా చెన్నపట్టణంలో ఉండదేమో అనిపించింది నాకు. ప్రతి స్తంభం మీదా తప్పనిసరిగా ఎందుకు సున్నపుబొట్లు ఉన్నాయా అని ఆలోచనలో పడ్డాను. అంతలో ఒక స్తంభం దగ్గర ఒక స్త్రీ కనిపించింది. కుతూహలం కొద్దీ అక్కడికి చరచరా వెళ్లి ఆమెకు కొంచెం దూరంలో నిలబడ్డాను. ఆమె తమలపాకులు వేసుకుంటోంది. ఆకులన్నీ అయిపోయిన తర్వాత చేతి బొటనవేలి మీద ఉన్న సున్నం ముద్దలో సగం నోట్లో వేసుకుని, మిగిలిన సగాన్ని దీపస్తంభం మీద పులిమి, ఆమె తన దారిని వెళ్లిపోయింది. అప్పుడు నాకు తెలిసింది, స్తంభాల మీద సున్నపు బొట్లు ఉండడానికి కారణం.

మరొక విషయం. పల్లెటూళ్లలోని బాటలమీద పేడకళ్ళు ఎలా కంటికగపడతాయో, అలాగే చెన్ననగరంలో బాటల మీద ఎర్రని తమ్మ కనిపిస్తుంది. నాముందు వెడుతున్న ఒక స్త్రీ తుబుక్కున ఒక చోట ఉమ్మివేసింది. ఇలా ఎక్కడ పడితే అక్కడ తమ్మవేయడం, ప్రతి దీపస్తంభాన్నీ సున్నపు బొట్లతో అలంకరించడం చూచి నేను కొంచెం అసహ్యించుకున్నాను. నిజం చెప్పవద్దూ మరి!

తిరువళ్ళిక్కేణి బీచి చేరాను. ఇసుకలో కొంత దూరం నడిచేసరికి నాకు ఆయాసం వచ్చింది. అయినా అలాగే మరి కొంత దూరం నడిచి ఒక చోట సుఖాసనం ఏర్పరుచుకున్నాను. చాలా మంది స్త్రీపురుషులు సైకతశ్రేణుల్లో కూర్చుని లోకాభిరామాయణం ముచ్చటించుకుంటున్నారు. నేను మాత్రం

ఏకాంతంగా ఉన్నాను. అందువల్ల పారావార వీచికావితా నాన్ని వీక్షిస్తూ అలౌకికమూ, అస్పష్టమూ, అవ్యక్తమూ అయిన ఆనంద మేదో అనుభవించసాగాను.

నేను కవిని గాను. లేకపోతే సరిత్పతిని సరసోక్తులతో వర్ణించి సహృదయ లోకానికి సంతోషం కలిగించి ఉండేవాణ్ణి. ఆ సముద్రపు హోరూ, పడిలేచే ఆ తరంగాలూ, ఆ తెల్లని నురుగుముద్దలూ—నన్నెంతో ఆకర్షించాయి. అహోరాత్రాలు సముద్రుడు ఘోషించేందుకు కారణం ఏమన్నా ఉన్నదా! అని ఊహాగానం చెయ్యసాగాను. బీచికి అభిముఖంగా ఉన్న ఉన్నత సౌధాలు స్ఫురణకు వచ్చాయి. అవి ఆర్కాటు నవాబులు తమకోసం, తమ రాణివాసం కోసం నిర్మించుకున్న వట! పాపం! ఏరీ ఆ రాజులు! వాళ్లు కాలగర్భంలో కలిసి పోయినా, వారి డబ్బు మాత్రం సౌధాలుగా నిలిచిపోయింది. అందుకనే కాబోలు 'రాజుల డబ్బు రాళ్లపాలు' అనే చవిగల నానుడి ఏర్పడింది. 'సిరిగల పెద్దలు దానధర్మాలు చేసి, దేశకళ్యాణానికి సహాయపడండి. ఆకాశంతో సయ్యాటలాడే సుందరసౌధాలు నిర్మించి డబ్బు దుర్వినియోగం చెయ్యవద్దు—' అని కాబోలు సముద్రుడు ఘోషిస్తున్నాడు!

ఆ ఉన్నత తరంగాల తాకిడికి తట్టుకోలేక ఒడ్డున చేరుతున్న నురుగుముద్దల్ని చూసి, చూసి చివరికి నా మనస్సు ఇలా ఘోషించింది.

నురుగులు, నురుగులు—తెల్లని
నురుగులు నురుగులు!
సముద్రపుటలలకు

సతమతమై పోయి
దారీ తెన్నూ కానక
దరిచేరే నురుగులు— తెల్లని
నురుగులు నురుగులు!
ఆర్థికదుస్థితికి
అణగిమణగిపోయి
బ్రతుకు బరువై పోగా
ఆశలన్నీ కరిగిపోగా
చింతలతో వంతలతో
చిమ్మచీకట్లలో
నికృష్టపు జీవితం గడిపే
నష్టజాతకులవలె
నలిగిపోయి, విరిగిపోయి
దరిచేరే నురుగులు— తెల్లని
నురుగులు, నురుగులు.

వెర్రివాడిలాగ ఆ నురుగుముద్దల వైపే చూస్తున్నాను. ఇంతలో ఒక చిన్న కుర్రవాడు 'తేంగా మాంగా బటాణీ' అంటూ నా దగ్గరికి వచ్చాడు. పరధ్యాసగా వుండడం మూలాన నేనేమీ అతనికి సమాధానం చెప్పలేదు. ఒక్క-క్షణం ఆగి 'సూడా యిరుక్కు (వేడిగా వున్నాయి) సార్' అన్నాడు.

ఆ చిన్నవాణ్ణి చూడగానే నాకెందుకో జాలి కలిగింది. అతనిచేతిలో ఒక పెద్ద డబ్బావుంది. పాలుకారే ఆ బుగ్గలూ, తేనెలొలికే ఆ మాటలూ, అభమూ శుభమూ ఎరగని ఆ చూపులూ—నన్నాకర్షించాయి. అతనిని చూసేకొద్దీ నాలో

ఏదో ఆవేదన బయలుదేరింది. 'ఇంత చిన్న వయస్సులో ఈ కుర్రవాడు జీవితభారాన్ని చవిచూస్తున్నాడు గదా!' అనుకున్నాను. అతని ముఖం చూస్తే మంచి కుటుంబంలో పుట్టి పెరిగినవాడిలా కనిపిస్తున్నాడు. నా ఆలోచనల్ని కట్టిపెట్టి 'ఒక పొట్లం ఈ నాయనా' అన్నాను. అణా తీసుకుని అతడు 'మాంగా తేంగా బటాణి' పొట్లం ఒకటి చేతిలో పెట్టాడు. ఎంతో ఆశతో పొట్లం విప్పి చూశాను. మామిడికాయ ముక్కలూ, కొబ్బరి కోరూ, ఉడకబెట్టిన బటాణీలూ కలగాపులగం చేసి అందులో పోపు పెట్టారు. ఇదీ మాంగా తేంగా బటాణీ. బటాణీలను పరీక్షగా చూడసాగాను. అంతలో ఆ కుర్రవాడు 'సార్, బాగా ఉండును. ఇంకో పొట్లం యిస్తునా?' అన్నాడు. 'సరే' అని మరో పొట్లం తీసుకున్నాను. ఆతర్వాత అతను వెళ్ళిపోయాడు.

బటాణీలు ఎంత రుచిగా ఉన్నాయనుకున్నారు! మామిడికాయ ముక్కలూ, కొబ్బరి కోరూ పంటికి తగిలినప్పుడల్లా నాలుకతుప్పు కాస్తా వదిలిపోయేది. రెండు పొట్లాలు రెండు నిమిషాలలో అయిపోయాయి. ఆ కుర్రవాడెవరో, అతని స్థితిగతు లేమిటో తెలుసుకోవాలనే ఉబలాటం కలిగింది. అతను వెళ్ళిన వైపే చూస్తూ కూర్చున్నాను. నేనతని వైపు చూడడం గమనించి, అతడు నా దగ్గరికి వచ్చాడు, మళ్ళీ నవ్వు మొగంతో. నేనూ అతన్ని చూస్తూ మందహాసం చేశాను.

ఇంకో బటాణీ పొట్లం డబ్బాలోంచి తీసి 'ఇస్తునా సార్?' అన్నాడు. పొట్లం తీసుకున్నాను. తిరిగి తిరిగి కాళ్లు నొప్పులు చేశాయి కాబోలు, అతనూ నా పక్కనే కూర్చుని డబ్బాలోంచి ఒక మురుకు (జంతిక) తీసి తినడం మొదలుపెట్టాడు.

'ఏం చదువుతున్నావు?' అడిగాను నేను.

'అయిదో క్లాస్ సార్.'

'అమ్మా నాన్నా ఉన్నారా?'

'ఉన్నారు సార్. తాత కూడా ఉన్నారు, సార్.

'మీ నాన్నగారి కేం పని?'

'ఆఫీసులో అటెండర్ పని, సార్.'

'అయితే నువ్వెందుకు బటాణీ లమ్ముతున్నావు?'

'అదంతా నాకు తెలీదు, సార్. బడినించి రాగానే మా అమ్మ నాకు కాఫీ యిస్తుంది. తర్వాత నేనొక డబ్బా, మా తాత ఒక డబ్బా తీసుకుని ఇట్లా బీచికి వచ్చివేస్తుము.'

'నీకు అక్కయ్యలూ, చెల్లెళ్లూ ఉన్నారా?'

'ఒక అక్కయ్య ఉంది సార్. రెండు చెల్లెళ్లు.'

పాపం, చాలీచాలని జీతాలతో ఎంత మంది యిలా కష్టపడుతున్నారో గదా! తన వయస్సులో ఉన్న కుర్రవాళ్లు కేరింతలు కొడుతూ ఆటలాడుతూంటే, ఈ అభాగ్యుడు మాత్రం అప్పుడే జీవితంలోని చీకటిని చూశాడు! తలిదండ్రులు మాత్రం ఏం చేస్తారు? కుటుంబపోషణం జరగాలి. వాళ్ళదీ తప్పు లేదు. ఆర్థికంగా అలమటించిపోతున్నారు. కాబట్టి వాళ్ళ సంతానం కూడా కష్టపడుతోంది. అయినా ఒకరిదగ్గిరికి వెళ్లి 'అడియేన్ దాసన్' అని యాచించకుండా ఈ విధంగా గౌరవంగా కాలక్షేపం చేస్తున్నారు. ఇది నాకెంతో సంతోషం కలిగించింది.

'ఏరా, రాముూ' అంటూ ఒక వృద్ధుడు వచ్చాడు మా దగ్గరికి. ఆయనే ఆ కుర్రవాని తాతయ్య. తాతా మనమళ్లు ఇంటికి దారి తీశారు.

'ఆర్థిక సమత్వం' అని కాబోలు సముద్రుడు ఘోషిస్తు న్నాడు.

## మిత్రుని ఇంటికి

మసకచీకటి పడింది. అంతకంతకూ ఎక్కువగా జనం వస్తున్నారు బీచికి. ఇంకా కొంతసేపు బీచిలోనే కాలం గడుపుదామని అనుకున్నాను. 'మా యింటికి ఎప్పుడూ నువ్వు రావు' అన్న మిత్రుని మాట సరిగ్గా అప్పుడే గుర్తుకి వచ్చింది. బీచి నుంచి బయలుదేరాను.

చెన్నపట్టణం శోభను ఏమని చెప్పను? బీచి పొడుగునా రకరకాల రంగురంగుల కారులు బారులుతీరి నిలబడి ఉన్నాయి. విలువగల వలువలు ధరించి యువతీయువకులు చెట్టాపట్టాలు పట్టుకుని విలాసంగా నడుస్తున్నారు. పరీక్షలయిపోవడంవల్ల విద్యార్థులు నిశ్చింతగా తిరుగుతున్నారు. పనీపాటూ లేని వయోవృద్ధులు లోకాభిరామాయణం ముచ్చటించుకుం టున్నారు. వాళ్ళ పాలిటికదే ఆత్మవిచారం!

బీచినంతా కలయజూచి నేనొక ప్రణాళికను తయారుచేశాను. ఆ ప్రణాళికా స్వరూపం కొంత మనవి చేస్తాను. సముద్రం చేరువగా ఉన్న పట్టణాలలో—అంటే మచిలీపట్టణం మొదలైన వాటిలో—ప్రభుత్వం బీచీలు ఏర్పాటుచెయ్యాలి. అంతకంటె ముఖ్యమైన విషయం. దంపతులు—వృద్ధులైనాసరే యువకులైనా సరే—బీచికి వెళ్ళేటట్లు ఒక చట్టంకూడా చేయ్యాలి; ఈ మాట కొంచెం విడ్డూరంగా ఉందా! క్షమించండి. తెలుగు దేశం లోని కొన్ని పట్టణాలలో స్త్రీపురుషులు కలిసిమెలిసి పార్కుల్లో

కూర్చుని మాట్లాడుకోవడం నేనంతగా చూడలేదు. ఒక వేళ ఎవరైనా ఆవిధంగా సాహసిస్తే పార్కుకి వచ్చిన పెద్దమనుషుల చూపులన్నీ వాళ్ళమీదే ఉంటాయి.

అసలువిషయం చెప్పడం మరిచిపోయాను. విద్యావిహీనుల లోని నిరుద్యోగ సమస్యను కొంతవరకు ఈ బీచి పరిష్కరిస్తు న్నదని నా విశ్వాసం. తేంగా మాంగా బటాణీలు, వడలు, మురుకులు మొదలైన తినుబండారాలు అమ్మే పిన్నలూ పెద్దలూ, సోడాలూ, ఐస్ క్రీములూ మున్నగు పానీయాలు అమ్మేవారూ, సినిమా పుస్తకాలూ, శంఖాలు మొదలైనవాటిని విక్రయించేవారూ—ఇంకా ఎందరెందరినో బీచి పోషిస్తున్నది. బీచి కనుక లేకపోతే మదరాసు మహానగరంలో గాలీ వెలుతురూ ప్రవేశించని చీకటి కొంపల్లో నివసించే చాలా మంది మధ్య తరగతి కుటుంబాలవారికి జీవితం నరకప్రాయం గానే తోచి ఉండేది.

సముద్రునికి ఒక్క నమస్కారం చేసి మిత్రుని యింటికి బయలుదేరాను. సందులు, గొందులు దాటిపోతున్నాను. ఆ మురికిసందులు అసహ్యంగా ఉన్నాయి. బీచిని చూచి నప్పటి సంతోషంకంటె ఈ సందులు చూచినప్పుడు కలిగిన రోత నా మనస్సులో నిలిచిపోయింది. రామరామ! ఆ సందులో నరుడైనవాడు తిరుగుతాడా అనిపించింది! అయితే మరి నేనెవరిని? చూస్తూ ఉండగానే ఒక చల్లని తల్లి తన ఆరేళ్ల కుర్రవాణ్ణి వీథిలోనే మలవిసర్జన చెయ్యమని ఆజ్ఞాపించి మరీ లోపలికి వెళ్ళిపోయింది. తమలపాకులు వేసుకుని ఒక వృద్ధుడు ఆ తమ్మను ఇంటిగుమ్మం దగ్గరే తుబుక్కుమని ఉమ్మి

వేశాడు. 'డస్ట్‌బిన్' ఉన్నా ఒక యిల్లాలు ఎంగిలాకుల్ని డస్ట్‌బిన్ పక్కగా పారేసి లోపలికి వెళ్ళిపోయింది. వాటిని గురించి అప్పుడే రెండు మూడు కుక్కలు కీచులాట మొదలు పెట్టాయి. ఈ రభసలోనే ఒక బాలిక హార్మోనియం వాయిస్తూ 'ఎందుకు తాగినావో' అని పాడుతోంది. శ్రీరామచంద్రునికి కూడా తాగే కర్మం పట్టిందా అనుకున్నాను. 'ఎందుకు దాగి నావో' అని త్యాగయ్యగారు పాడితే మనం మన అలవాట్లను ఆ రాముడికి కూడా అంటగడుతున్నామా! అనిపించింది.

సందులు దాటి కొంచెం విశాలమైన వీధిలోకి ప్రవేశించాను. వచ్చేపోయే బస్సుల్ని చూసుకుంటూ నేను పేవ్‌మెంటుమీద నడుస్తున్నాను. కొంతదూరం పోగా పేవ్‌మెంటు మీద స్థిరనివాసాలు ఏర్పరుచుకున్న అభాగ్యులు కనబడ్డారు. వారిని చూసేసరికి నా గుండె బద్దలయింది; కళ్ళేపల్లి చెరువయింది. ఆ దురదృష్టవంతులు అక్కడే వంట చేసుకుంటున్నారు; అక్కడే అన్నపానీయాలు అన్నీ. అక్కడ ఒక మానవతి డబ్బారేకులు అడ్డంపెట్టుకుని స్నానం చేస్తోంది. చెన్ననగరంలో చూడవలసింది బీచిని కాదు. ఈ పేవ్‌మెంట్లమీద నివసిస్తున్న దరిద్ర దామోదరులనే! 'అయ్యో! చెన్ననగర లక్ష్మీ! నీ సిరులు గొడ్డుపోయాయా?' అని పరితపించాను.

చివరికి నా మిత్రుని ఇల్లు చేరుకున్నాను. అది పాతకాలపు ఇల్లు. పొడుగ్గా ఒక గుహలా ఉంది. మినుకు మినుకుమంటూ దీపాలు వెలుగుతున్నాయి. అవి విద్యుద్దీపాలే; నలభై వాట్లవి. సింహద్వారం దాటి రెండడుగులు ముందుకు వేశాను. చాలా కాపరాలు ఉన్నట్లు కనిపించాయి. నా మిత్రుడు

ఏ భాగంలో ఉన్నాడో తెలియదు. కనుక 'నరసింహన్' అని రెండుసార్లు గొంతెత్తి పిలిచాను.

నా మిత్రుడు పేరు నరసింహన్. అతని తండ్రి చాలా కాలం తెలుగుదేశంలో స్టేషన్ మాస్టరుగా పనిచేశాడు. అందువల్ల నరసింహన్ తెలుగు చదువుకున్నాడు. చక్కగా తెలుగు మాట్లాడతాడు.

నేను పిలిచిన రెండు నిమిషాలకు ఒక ఆరేళ్ళ అమ్మాయి వచ్చింది. ఎవరు కావాలని అడిగింది.

'నరసింహన్ ఉన్నాడా?'

'మా మావఁదానే.'

'అవును. మీ మామయ్యే.'

వెంటనే ఆ అమ్మాయి లోపలికి వెళ్ళింది.

ఇంతలో ఒక యాభై ఏళ్ళ వ్యక్తి లోపలికి వచ్చాడు. ఆయన వేషం చాలా గంభీరంగా ఉంది. ఆయనే ఆ గృహ యజమాని అనుకున్నాను. ఆయన్ని చూడడంతోనే ఒక కాపురస్థుడు 'రండి—రండి' అంటూ ఒక కుర్చీ వేశాడు.

గృహయజమాని ఆయన యోగక్షేమాలు విచారిస్తూ వుండగా, ఇంకా యిద్దరు ముగ్గురు కాపురస్థులు అక్కడికి చేరారు. అంతే; ఒక వాగ్వాదం అరంభ మయింది.

'ఏమండీ, యింటికి సున్నంకొట్టి మూడేళ్ళయింది. చూడ్డానికి అసహ్యంగా వుంది. ఈ నెల్లో అయినా సున్నం కొట్టిస్తే సంతోషిస్తాం' అన్నాడు ధైర్యంచేసి ఒక కాపురస్థుడు.

వెంటనే తడుముకోకుండా గృహయజమాని కొంచెం హెచ్చుస్థాయిలోనే 'మా మేస్త్రీకి చెప్పాను. రెండు మూడు రోజుల్లో పని ఆరంభిస్తాను లెండి' అన్నాడు.

'రెణ్ణెల్లక్రితం అడిగినప్పుడు కూడా తమరిలాగే అన్నారు. ఎప్పటికప్పుడు ఇట్లా చెబితే ఎలాగండి?' అని మరొక కాపురస్థుడు నవ్వుతూ అన్నాడు.

గృహయజమాని రుద్రుడయ్యాడు. 'ఉంటే ఉండవయ్యా, లేకపోతే పోవయ్యా ఇంట్లోంచి. ఈ యింటికోసం ఎంతో మంది తిరిగిపోతున్నారు' అన్నాడు కొంచెం కటువుగా. ఆ కాపురస్థుడు మొదట్లో నిర్ఘాతపోయినా, తర్వాత కోపం తెచ్చుకుని 'ఇదేనటయ్యా పెద్ద మనిషితనం. గౌరవం ఇచ్చి, గౌరవం పుచ్చుకోవాలి' అన్నాడు.

దానితో వాగ్వాదం శ్రుతిమించి రాగాన పడింది.

ఇంటి యజమాని ఆ కాపురస్థుణ్ణి నానా దుర్భాషలాడాడు. అతను కూడా ఇంటి యజమాని పుట్టుపూర్వోత్తరాలను ఏకరువు పెట్టాడు. వాళ్ళ కేకలతో ఇంట్లో ఉన్న చిన్నా పెద్దా, ఆడా మగా అందరూ బిలబిలమంటూ అక్కడికి వచ్చి చేరారు.

నేను నా మిత్రునివిషయమే మరిచిపోయాను. 'ఏమయ్యా. కులాసాగా ఉన్నావా?' అంటూ వెనకాలగా నా భుజం చరిచారు ఎవరో. తిరిగి చూద్దునుగదా—నరసింహన్.

ఇంటి యజమాని నుద్దేశించి 'అతని కీమధ్య డబ్బుదాహం మరీ ఎక్కువయింది లే. కొంచెం క్రాక్' అని నన్ను వీధిలోకి తీసుకొని వెళ్ళాడు.

వీథి తిన్నె మీద కూర్చున్నాం. ఏవో మాటలలో మునిగి పోయాం.

కొంతసేపటికి గృహయజమాని కోపంతో వీథిలోకి వచ్చాడు. నా మిత్రుని చూచీచూడడంతోనే 'వచ్చే నెలనుంచి బాడుగ ఎక్కువ చేశాను. ఈ విషయం మీ నాన్నగారితో చెప్పు. ఇష్టమైతే ఉండండి. కష్టమైతే లేచిపోండి' అని అక్కడ ఒక నిమిషమైనా నిలవకుండా వెళ్ళిపోయాడు.

నరసింహన్ నిశ్చేష్టుడైనాడు.

'ఇప్పుడు యాభై రూపాయలు అద్దె యిస్తున్నాం. నా జీతంలో నాలుగో వంతు అద్దె కిందపోతే, ఎలాగయ్యా యీ మహా పట్టణంలో కాలక్షేపం చేసేది!' అన్నాడు జాలిగా.*

* సుమారు పన్నెండేళ్ల క్రితం చేయబడిన రచన యిది.